క్లుప్తంగా

ప్రభుత్వ భూమి ఆక్రమణ


ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

దొరవారిసత్రం: నెలబల్లి రెవెన్యూ పరిధిలోని కలగుంట ఎస్టీకాలనీ ఆనుకుని సుమారు మూడెకరాల ప్రభుత్వ భూమిని అదే ప్రాంతానికి చెందిన కొందరు ఆక్రమించుకుని సాగు సిద్ధం చేస్తున్నట్లు కాలనీ వాసులు తెలిపారు. ఈ ఆక్రమణపై సంబంధిత రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు ఆరోపించారు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డిని వివరణ కోరగా కలగుంట ఎస్టీ కాలనీ వద్ద ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైన విషయం తమ దృష్టికి రాలేదన్నారు. విచారించి చర్యలు తీసుకోవడంతోపాటు ఆక్రమణలను అడ్డుకుని ప్రభుత్వ భూమిని కాపాడుతామని తెలిపారు.

అసత్య ప్రచారాలు తగవు

గూడూరురూరల్: ప్రతిపక్ష నేత చంద్రబాబు, టీడీపీ నాయకులు ప్రజలను మభ్యపెట్టడానికి అసత్య ఆరోపణలు చేయడం తగదని వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మగ్దూమ్ మోహిద్దీన్ అన్నారు. గూడూరులోని వైఎస్సార్ సీపీ మైనార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జలీల్, మైనార్టీ నాయకులు షాకీర్, యస్దానీ, వేణు పాల్గొన్నారు.

సన్నారెడ్డికి ఎమ్మెల్సీ పరామర్శ

కోట: మండలంలోని కర్లపూడిలో సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డిని ఎమ్మెల్సీ మేరిగ బుధవారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్ శ్రీనివాసులురెడ్డి ఇటీవల మృతి చెందారు. దీంతో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ కర్లపూడికి చేరుకుని శ్రీనివాసులురెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డిని పరామర్శించారు. ఎమ్మెల్సీ వెంట నాయకులు నాగూర్‌రెడ్డి, వీ రామచంద్రారెడ్డి, పరంధామరెడ్డి తదితరులు ఉన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎంపీటీసీ సభ్యుడు మొబీన్‌బాషాను ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పరామర్శించారు.

దాడి చేసి.. గాయపరిచారని ఫిర్యాదు

చిల్లకూరు: బైక్‌పై వెళ్లే సమయంలో దారిలో ఉన్న వారిపై బైక్ లైటింగ్ పడిందని ఓ యువకుడిపై ఐదుగురు దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. చిల్లకూరు దళితవాడకు చెందిన కల్లూరు సుమన్ అనే యువకుడు మంగళవారం రాత్రి గూడూరు నుంచి బైక్‌లో వస్తున్న క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న ప్రవీణ్ అనే యువకుడిపై లైట్ పడింది. దీంతో అతను తన స్నేహితులైన నహీమ్‌తోపాటు మరో ముగ్గురిని తీసుకెళ్లి దళితవాడలోని అంబేడ్కర్ సెంటర్‌లో సుమన్‌పై దాడికి పాల్పడడంతో అతను తీవ్రంగా గాయపడి గూడూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నామినేషన్లు నిల్

వెంకటగిరిరూరల్: మండలంలోని పాళెంకోట పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో 8వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే ఇప్పటివరకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. నామినేషన్ల స్వీకరణ శుక్రవారంతో ముగియనుందని చెప్పారు. కార్యాలయ పనివేళల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలలోపు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసుకోవాలని సూచించారు.ఎన్నికల అధికారిగా డక్కిలి ఎంఈఓ జగదీష్‌బాబు వ్యవహరిస్తున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం


కిట్‌ను అందజేస్తున్న కౌన్సిలర్ మల్లీశ్వరి

వెంకటగిరి: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంతో గర్భిణులు, బాలింతలకు చక్కటి ఆరోగ్యం చేకూరుతుందని 20వ వార్డు కౌన్సిలర్ కె మల్లీశ్వరి తెలిపారు. పట్టణంలోని 20వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఆమె పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం స్త్రీ, శిశుసంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కె సతీష్‌కుమార్, మహిళా పోలీస్ ప్రసన్న పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై ఫిర్యాదు

చిల్లకూరు: వివాహమై ఏడాది పూర్తి కాక ముందే అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారని ఓ వివాహిత చిల్లకూరు పోలీసులను బుధవారం ఆశ్రయించింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని నాంచారమ్మపేటకు చెందిన కావ్యకు ఏడాది కిందట కోవూరు మండలం మోడేగుంట గ్రామానికి చెందిన కాకి సునీల్‌తో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. కొద్ది రోజులు అన్యోన్యంగా ఉన్నారు. ఆమె ఎనిమిది నెలల గర్భవతిగా ఉండగా ఆమెను అదనపు కట్నం తేవాలని భర్తతో పాటు అతడి వదిన సుభాషిణి వేధించారు. వారి వేధింపులు తట్టుకోలేక కావ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విచారణ జరిపి వివాహిత భర్త సునీల్, అతడి వదిన సుభాషిణిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపాల్ తెలిపారు.

బొప్పాయి.. లాభాలు గొప్పోయి

బొప్పాయి సాగు కర్షకుల కష్టాలు తీరుస్తోంది. సేద్యంలో ఏటా లాభాలు పొందడం ఎలా ఉంటుందన్న రుచి చూపుతోంది. దీంతో ఈ పంట సాగుపై పుడమి పుత్రులకు నమ్మకం కలుగుతోంది. ఈ క్రమంలో రైతులు బొప్పాయి సాగు చేసి, గొప్ప లాభాలు ఆర్జిస్తున్నారు.

- సిరులు పండిస్తున్న పంట
- సాగుపై కర్షకుల మొగ్గు


సైదాపురం మండలంలో సాగు చేసిన బొప్పాయి

సైదాపురం: బొప్పాయి మంచి ధరలు పలుకుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బొప్పాయి ఈ ఏడాది కిలో రూ.8 నుంచి రూ.13 ధర పలుకుతుండడంతో పంటసాగు చేసిన రైతుల మోముల్లో చిరునవ్వులు చిందుతున్నాయి. ఇలాగే ధరలు పలికితే అధిక శాతం మంది బొప్పాయి పంటపై ఆసక్తి చూపే అవకాశం ఉంది. దీనికితోడు తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో సాగు చేసుకునే వీలుంది. దీనికితోడు ఉద్యానశాఖాధికారులు కూడా క్షేత్రస్థాయిలో కర్షకులకు పంటసాగులో సలహాలు, సూచనలు ఇస్తున్నారు. అలాగే ప్రభుత్వం బొప్పాయి సాగుకు రాయితీ కూడా ఇస్తుండటంతో దీని సాగుపై రైతులు మొగ్గుచూపుతున్నారు.

300 ఎకరాల్లో బొప్పాయి సాగు

మండలంలోని తురిమెర్ల, పాలూరు, వేములచేడు, నల్లబొట్లపల్లె, గంగదేవిపల్లె, చాగణం, అనంతమడుగు, కృష్ణారెడ్డిపల్లె, తోచాం, లింగనపాళెం


పంటకు మందు పిచికారి చేస్తున్న రైతు

గ్రామాల్లోని రైతులు రైతులు సుమారు 300 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశారు. ఈ ఏడాది రైతులు ఆశించిన ధరల కన్నా రెట్టింపు ధరలు పలుకుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎకరా సాగుకు దుక్కి నుంచి దిగుబడి వరకు రూ.లక్ష ఖర్చు అవుతుంది. ఎకరాకు దిగుబడి 30 నుంచి 40 టన్నులు వస్తుంది. ఎకరాకు సుమారు రూ.4లక్షల వరకు వస్తుంది.

పెట్టుబడికి ధోకా ఉండదు



బొప్పాయి సాగు చేస్తే పెట్టుబడి ధోకా ఉండదు. నష్టపోయే అవకాశం ఉండదు. ఈ ఏడాది నేను సుమారు 2 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశాను. మంచి ధరలు పలుకుతుండడంతో పెట్టుబడులు పోనూ మంచి ఆదాయం వచ్చింది. ధరలు ఇలాగే ఉంటే నా శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది.

– బొలిగర్ల శివకుమార్, సైదాపురం

హెక్టారుకు రూ.18 వేలు రాయితీ



బొప్పాయి రైతులకు ప్రభుత్వం విరివిగా ప్రోత్సహకాలు ఇస్తోంది. ఏడాదికి హెక్టార్ బొప్పాయి సాగుకు రూ.18 వేల రాయితీ వస్తుంది. అలాగే రెండో ఏడాది కూడా బొప్పాయి పంటను సాగు చేసే రైతుకు అదనంగా హెక్టారుకు రూ.6 వేలు వంతున వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోంది. బొప్పాయి సాగుకు పూర్తిరాయితీతో డ్రిప్ సౌకర్యం కల్పిస్తున్నాం.

– ఆనంద్, ఉద్యానవనశాఖాధికారి, పొదలకూరు

దౌర్జన్యకాండకు నిరసనగా ర్యాలీ


సైదాపురంలో ర్యాలీ చేస్తున్న నేతలు

సైదాపురం: పుంగనూరులో జరిగిన దౌర్జన్యకాండను నిరసిస్తూ బుధవారం సైదాపురంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ చంద్రబాబు వయస్సు మీరుతున్న కొద్దీ మతి భ్రమించి పార్టీ శ్రేణులను అల్లర్లకు ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నేత ఎం మాలకొండారెడ్డి, ఏఎంసీ అధ్యక్షుడు జీ శ్రీనివాసులురాజు, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు ఎన్ రాంగోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు జీ శివకుమార్, సర్పంచ్‌లు వరప్రసాద్‌రాజు, బట్టా వెంకటయ్య, సుబ్బరాజు, నేతలు బీ శివకుమార్, కే శ్రీనివాసులు చౌదరి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల విక్రయం


జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

గూడూరురూరల్: ఈ ఏడాది హర్ ఘర్ తిరంగా పేరిట జాతీయ జెండాలను విక్రయించేందుకు తపాలా శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. హర్ ఘర్ తిరంగాలో భాగంగా బుధవారం గూడూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో పోస్టల్ శాఖ అధికారులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలు పోస్టాఫీసుల్లో రూ.25 చెల్లించి 20/30 అంగుళాల జాతీయ జెండాను కొనుగోలు చేసుకోవచ్చన్నారు. పోస్టాఫీసుకు వెళ్లలేని వారు www.epostoffice.gov.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకుని, చిరునామా వివరాలు పొందుపరిస్తే ఇంటి వద్దకే జెండాలు అందజేస్తారన్నారు. ఈనెల 12వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు మాత్రమే బుకింగ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఒక్కొక్కరికి గరిష్టంగా 5 జెండాలు మాత్రమే విక్రయిస్తారన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

తిరుపతి అర్బన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం సూళ్లూరుపేట నియోజకవర్గం అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, వర్గ, మత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందేలా అధికారులు పని చేయాలని చెప్పారు. ఎమ్మెల్యే సూచించిన పనులకు ప్రాధాన్యతను ఇవ్వాలని తెలిపారు. ఎమ్మెల్యే సంజీవయ్య మాట్లాడుతూ అధికారులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. 25 అంగన్ వాడీ కేంద్రాలకు కొత్తభవనాలు కావాలని, పాడైన చెక్ డ్యామ్‌లు పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ఆక్రమణలను తొలగించండి

సూళ్లూరుపేట: మున్సిపాలిటీ పరిధిలో షార్ కేంద్రానికి సంబంధించిన స్థలాలను ఆక్రమించుకున్న వారు వెంటనే ఖాళీ చేయాలని షార్ గ్రూప్ మేనేజర్ గోపీకృష్ణ హెచ్చరించారు. ఆక్రమణదారులు శుక్రవారం ఉదయం 10 గంటలలోపు స్వచ్ఛందంగా వారే తొలగించుకుంటే మంచిదని, లేదంటే షార్‌కు చెందిన భద్రతాదళాల సిబ్బంది, పోలీసులు, మున్సిపల్ అధికారులు కలిసి బలవంతంగా ఖాళీ చేయించాల్సి వస్తుందన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

డక్కిలి: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ కే వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని వెలికల్లు మెయిన్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. జగనన్న గోరుముద్ద పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట హెచ్ఎం పుల్లయ్య, ఉపాధ్యాయురాలు మహేశ్వరి ఉన్నారు.

నేదురుమల్లితో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి భేటీ

రాపూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం రాపూరు తెలుగుగంగ అతిథి గృహంలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ని రామ్‌కుమార్‌రెడ్డి శాలువతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బీ పట్టాభిరామిరెడ్డి, నాయకులు పీ మధుసూదన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డీ నారాయణరెడ్డి, ఎంపీపీ ప్రసన్న, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, పెంచలకోన ఆలయ చైర్మన్ సీ తిరుపాల్‌రెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నా మట్టి- నాదేశం'తో హరిత విప్లవం



చిల్లకూరు: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నా మట్టి- నాదేశం కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో వందకు తక్కువ కాకుండా మొక్కలు నాటి హరిత విప్లవానికి నాంది పలుకుతున్నామని ఎంపీడీఓ నిర్మలాదేవి తెలిపారు. మండలంలోని తూర్పుకనుపూరు, తిక్కవరం, పారిచెర్లవారిపాళెంలో బుధవారం నామట్టి- నాదేశం అనే కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి, శిలాఫలకాలను ఏర్పాటు చేశారు. సర్పంచ్‌లు ఏ నాగమ్మ, ఓ సతీష్‌రెడ్డి, ఏపీఓ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మల్లాం ఆలయాభివృద్ధికి సహకరిస్తా



చిల్లకూరు(చిట్టమూరు): మల్లాంలోని పురాతన ఆలయమైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి సహకారం అందిస్తామని ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మల్లాంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సీ సాయికుమార్‌రెడ్డి కమిటీ సభ్యులు ఆర్డీఓకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో చేపట్టాల్సిన పనులను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లగా తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

ఇంటిపై దాడి

దొరవారిసత్రం: గొల్లపాళెం గ్రామానికి చెందిన షేక్ అక్బర్ హమీద్ ఇంటిపై అక్కరపాక గ్రామానికి చెందిన శంకరయ్య తన అనుచరులతో వెళ్లి దాడి చేసి పలు వస్తువులను ధ్వంసం చేసిన ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి చూసింది. దాడిపై ఇరు వర్గాలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాయి. ఎస్ఐ తిరుమలరావు కథనం మేరకు.. పోలిరెడ్డిపాళెం సచివాలయం వద్ద మంగళవారం అక్బర్ హమీద్, శంకరయ్య ఘర్షణ పడ్డారు. అనంతరం గొల్లపాళెంలోని అక్బర్ హమీద్ ఇంటి వద్దకు శంకరయ్య తన అనుచరులతో వెళ్లి కర్రలతో దాడి చేసి, ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. ఇరువురి ఫిర్యాదు మేరకు విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అవ్వా.. నీకు పింఛన్ వస్తుందా?


వెంకటగిరి: వృద్ధురాలికి బుక్‌లెట్ అందజేసి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న నేదురుమల్లి

వెంకటగిరి: అవ్వా.. నీకు పింఛన్ వస్తుందా? అని ఓ వృద్ధురాలిని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరా తీశారు. పట్టణంలోని 18వ వార్డు పెద్దమసీదు వీధి, మార్కెట్ వీధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి, వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. ఆయా ఇళ్లలో ఉన్న అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మసీదువీధిలో ఓ వృద్ధురాలితో 'అవ్వా.. నీకు పింఛన్ వస్తుందా?' అని ఆరా తీశారు. 'నా బిడ్డ జగన్ ఉండగా నా కేం తిప్పలు బిడ్డా.. ప్రతి నెలా పింఛన్ ఇంటికే తెచ్చి ఇస్తున్నారు' అని సమాధానం ఇచ్చింది. అదే వార్డులో నివాసం ఉన్న నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద నివాసంలో అధికారులు, స్థానిక నాయకులతో కలిసి టీ తాగుతూ ఆ ప్రాంతంలోని స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వై విజయలక్ష్మి, మున్సిపల్ వైస్‌చైర్మన్ సీహెచ్ ఉమామహేశ్వరి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, కౌన్సిలర్లు ఏ శంకరయ్య, వహీద, ఏ శ్రీనివాసులురెడ్డి, నాయకులు యస్దానీ, కె బ్రహ్మయ్య, పరదేశి, తదితరులు పాల్గొన్నారు.


రాపూరు: బుక్‌లెట్ అందజేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

ఇంటింటా సంక్షేమ పాలన

రాపూరు: రాష్ట్రంలో ఇంటింటా సంక్షేమ పాలన సాగుతుందని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జోరేపల్లె అక్కమాంబపురం, జోరేపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో కలసి ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు.

జై పోలేమ్మా.. జైజై పోలేరమ్మా..!


పోలేరమ్మకు పూజలు చేస్తున్న నాయకులు, భక్తులు

వెంకటగిరి: పోలేరమ్మ జాతరను రాష్ట్రపండుగగా గుర్తించిన నేపథ్యంలో పట్టణంలోని వార్డుల్లో ఉన్న పోలేరమ్మ ఆలయాల్లో సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. బుధవారం పట్టణంలోని 23వ వార్డులోని పోలేరమ్మ పుట్టిల్లు అయిన కుమ్మరిల్లు వద్ద ఆ వార్డు కౌన్సిలర్ ఏ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భానుప్రియ హాజరై, పోలేరమ్మకు సంప్రదాయబద్ధంగా అంబళ్లు సమర్పించి, భక్తులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ఎస్ బాలయ్య, పూజారి లక్ష్మి, నేతలు డీ రాధమ్మ, జి ఢిల్లీబాబు, కౌన్సిలర్లు ఏ శంకరయ్య, టి సుబ్బారావు, ఎస్ గోపాలకృష్ణ, కె కృష్ణమూర్తి, నాయకులు సీహెచ్ మురళీకృష్ణ, ఎన్ దుర్గాప్రసాద్, పీ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి


సమీక్షిస్తున్న జేడీ సుధాకర్‌రాజు

సైదాపురం: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే ప్రతి పంటకూ ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలని జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్ రాజు ఆదేశించారు. స్థానిక ఏఓ కార్యాలయంలో బుధవారం ఈ-క్రాప్ నమోదుపై సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు చేయడం ద్వారా రైతులకు పలు ప్రయోజనాలుంటాయన్నారు. సున్నావడ్డీతో పాటు పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట ఉత్పత్తుల కొనుగోలుకు ఈ-క్రాప్ నమోదు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వెబ్‌ల్యాండ్, సీసీఆర్సీ డేటా ఆధారంగా ఈ-క్రాప్‌ను నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 15వ తేదీలోపు ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కౌలు రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులను కూడా మంజూరు చేయాలన్నారు. అలాగే పీఎం కిసాన్ పథకం రాని వారికి ఈకేవైసీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు శ్రీనివాసులు, నరసోజీరావు, ఏ హైమావతి పాల్గొన్నారు.

హరోహర.. హరోహర..!


వెంకటగిరి: గ్రామోత్సవంలో జానపద కళాప్రదర్శన


వెంకటగిరి: సుబ్రమణ్యంస్వామి గ్రామోత్సవం

వెంకటగిరి: పట్టణంలోని కైవల్యానది సమీపంలో ఉన్న సుబ్రమణ్యంస్వామి ఆలయం బుధవారం భక్తుల హోరహర నామస్మరణలతో మార్మోగింది. ఆడికృత్తిక పురస్కరించుకుని ఆలయంలో హోమం, అభిషేకం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించారు. స్వామివారిని నెమలివాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కలశాలతో గ్రామోత్సవంలో పాల్గొన్నారు. జానపద కళారూపాలు అలరించాయి.

వైభవంగా ఆడికృత్తిక ఉత్సవాలు

వాకాడు(చిట్టమూరు):ఆడికృత్తిక సందర్భంగా బుధవారం చిట్టమూరు మండలం మల్లాంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. వేద పండితులు ఉదయం గణపతి హోమం,పాలాభిషేకం,కలశాభిషేకం, పంచామృతాభిషేకం, పుష్పయాగం, శాంతి కళ్యాణం, గ్రామోత్సవం జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్: పట్టణంలో ఆడికృత్తిక వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విజయగణపతి ఆలయంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేక పూజలు, పూర్ణహుతి చేశారు. సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ బీ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు కావడి మొక్కుల చెల్లించడానికి శ్రీకాళహస్తి, తిరుత్తణి తదితర పుణ్యక్షేత్రాలకు తరలివెళ్లారు.భక్తులు కావళ్లతో గ్రామాల్లో ఊరేగింపుగా కుటుంబ సభ్యులతో కలిసి ముందుకు సాగారు.

డక్కిలిలో..

డక్కిలి: స్థానిక వినాయకుడి గుడి వద్ద ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆడికృత్తిక వేడుకలను నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

వెంకటగిరి రూరల్‌లో..

వెంకటగిరిరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆడికృత్తిక వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని శివాలయాలు, సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయాలను భక్తులు సందర్శించి, ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఆడికృత్తిక సందర్భంగా పలు ఆలయాలు పండుగ వాతావరణం నెలకొంది.

విద్యుత్ షాక్‌తో ఒడిస్సా యువకుడి మృతి


యువకుడి మృతదేహం

చిల్లకూరు: మండలంలోని చింతవరం సమీపంలో ఒడిస్సాకు చెందిన ఓ యువకుడు విద్యుత్ షాక్‌తో బుధవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన కొంతమంది ఫైబర్ కేబుల్ పనులు చేస్తూ మండలంలోని రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలకు కేబుళ్లను అమర్చుతున్నారు. ఈ క్రమంలో పనులు చేసేందుకు వచ్చి ఒడిస్సాకు చెందిన జనకుంబ్‌రా(28) అనే యువకుడు స్తంభం ఎక్కి కేబుల్ అమర్చే సమయంలో పైన వెళుతున్న హైటెన్షన్ వైర్లు తగిలి, కింద పడ్డాడు. దీంతో సహచర కూలీలు అతడిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు విచారణ అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

వెంకటగిరి: పట్టణంలో బుధవారం గిరిజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ వేదిక జాతీయ అధ్యక్షుడు వినాయక్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీలు అంతరించిపోతున్న నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి చేపట్టిన చర్యల్లో భాగంగా ఏటా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీదినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు అడవయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గిరిజన ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు వినాయక్